# తిరుగుబాటు వేదాంతం

పి. ఎస్. ఆర్. మూర్తి

**అప్పుడే స్కూల్ నించి వచ్చిన శంకర్రావు ఎదురుగా పడక్కుర్చీలో కూర్చొని చుట్ట కాలుస్తున్న మామగార్ని చూసి పలకరించాడు.**

"ఇప్పుడేనా రావడం? ఇంటిదగ్గర అందరూ బాగున్నారా?"

"విశేషంగా వున్నారు. ఇప్పుడే నాలుగ్గంటల బస్సులో వచ్చా" శంకర్రావు లోపలికెళ్ళి బట్టలు మార్చుకొని వచ్చి మావగారి కెదురుగా కుర్చీలో కూర్చున్నాడు. లోపల్నించి శాంత కాఫీ కప్పుతో వచ్చింది.

"మీ నాన్నకివ్వు" అన్నాడు శంకర్రావు.

"ఏం కాఫీలో ఏవిటో. మా చిన్నతనంలో ఎరుగుదుమా? పొద్దున్నే ఇంత చద్దన్నం తిని...." కాఫీ కప్పు అందుకొని, ఆరిపోయిన చుట్ట తీసి పరిశీలించాడు. శాంత ఇంకో కాఫీ కప్పు తెచ్చింది.

"మొన్న మా చెల్లెల్ని చూసి వెళ్ళిన వాళ్ళేమైనా కబురంపారో, లేదో తెలుసుకోడానికి వచ్చారట" అంది శాంత.

"రాధని పెళ్ళి చేసుకోడానికి అతని కేమీ అభ్యంతరంలేదు- అతని తల్లిదండ్రులకి తప్ప."

"కట్నం ఎక్కువ ఇవ్వలేమని ముందే చెప్పాంకదా" చుట్ట మళ్ళీ ముట్టించాడు.

"అదొక్కటేనా? ఇంకాచాలాఉన్నాయి లెండి."

"అందుకనే మనపరిస్థితి అంతాచెప్పాను. రాధకు పెళ్ళి. గోపిక చదువు రెండూ సమస్యలే. వాడి బియ్యే చదువుకే తాతలు దిగొస్తున్నారు. దీనిపెళ్ళికి పొలం అమ్మాను. ఇప్పుడు పెళ్ళికి ఖర్చు ఎక్కువ పెడితే వాడికి ఇబ్బంది. ఎలాగూ నీ స్నేహితుడంటున్నావు కనక...."

"నాకిన్నిసార్లు చెప్పాలటండీ. అమ్మాయి అందం, గుణం ముఖ్యమంటాడు వాడు. కట్నం ముఖ్యమంటారు వాడి అమ్మా, నాన్నా. వాడికెక్కువ సెలవులులేవు. పెళ్ళి చేసుకొని పిల్లని వెంటబెట్టుకు తీసుకుపోతానంటున్నాడు."

"దానికేవుంది? పెళ్ళి రేపేపాటికి జరిపించనూ: అమ్మాయ్! మంచినీళ్లపట్టామ్మా" కేకేశాడు సుందరరామయ్య. చుట్టను పారేద్దామా వద్దా అనే సందిగ్ధావస్థలోపడ్డాడు.

"మనం చేస్తాం సరే. కాని వాళ్ళవాళ్లు ఒప్పుకోవడం లేదు. ఇప్పుడు తను ఒంటరిగా బొంబేలో ఉద్యోగం చేస్తున్నాడు కదా! నెలకు రెండొందలో, మూడొందలో తల్లిదండ్రులకి పంపిస్తున్నాడు. పెళ్ళి చేస్తే తనూ తన సంసారం అని డబ్బు పంపడం మానేస్తాడేమోనని వాళ్ళ భయం. ఇది అసలు కారణమని అతనే అన్నాడు. కాకపోతే కట్నం తక్కువ, శాఖాభేదం ఇవన్నీ పైపై పూతలు."

"ఇదెక్కడి విడ్డూరం? ఎవడి సంసారం వాడు చూసుకోక తప్పుతుందా? ఎంతకాలం పంపగలడు తల్లిదండ్రులకి? ఏదో ఒంటరిగా ఉన్నంతకాలం; తర్వాత ఎవడి బతుకు వాడిదేకదా! లోకంలో చూస్తూనే ఉన్నాంగా" అన్నాడాయన.

శాంత మంచినీళ్ళు ఇచ్చిపోతూఅంది. "అయినా దూరాభారం. ఎక్కడో బొంబేలో ఉద్యోగం. ఇచ్చేముందే ఆలోచించుకోవాలి. అంతదూరం పంపుదామా. వద్దా అని."

"ఎక్కడైతేనేం. పిల్ల సుఖం మనకికావాల్సింది. విదేశాలకు పోయేవాళ్ళులేరూ?"

ఆ మధ్య సంబంధం తప్పిపోతుందేమోననే సందేహం పట్టుకుంది సుందరరామయ్యకు. ఆ ఉద్దేశంతోనే అప్పుడు ఆ బాధను ఉపశమింపజేసుకొని కర్మతో ముదేస్తూ అన్నాడు—

"ఒంటరిగా బొంబాయిలో ఉంటున్నాట్ట. ఈ రోజుల్లో కుర్రకారుని నమ్మగలమా? ఎవతో ఒకతె ఉండే ఉంటుంది. అసలక్కడ ఏం చేస్తున్నాడో మనకేం తెలుసు?"

ఆ మాటలు గుర్తొచ్చి నవ్వుకున్నాడు శంకర్రావు. మనుషులంతే. అవసరాన్నిబట్టి నీతిని అవలీలగా మారుస్తారు. అప్పుడలా అన్నారు. ఇప్పుడు అబ్బాయి ఒప్పుకున్నాడనగానే "పిల్ల సౌఖ్యం ముఖ్యం. దూరమైతే ఏం పోయిందని" అంటున్నాడు.

"అబ్బాయి తల్లిదండ్రులకి ఇష్టం లేదు కనక ఏవన్నా చేస్తారేమో పెళ్ళి ఆపు చేయించడానికి?"

"నేనదంతా ఆలోచించాను. మైనారిటీ సమస్యలేదు. ఏవన్నా బలప్రయోగానికి దిగుతారనుకుంటే నాకు తెలిసిన పోలీసాఫీసర్ ఉన్నాడు. ఆయన్ని కూర్చోబెడదాం. చాలదనుకుంటే మేజిస్ట్రేట్ ఒకాయన తెలుసు. ఆయనకి వెళ్ళి చెబుదాం."

"తీరా సమయానికి ప్లేటు ఫిరాయిస్తాడేమో?" సందేహం వ్యక్తం చేశాడు సుందరరామయ్య.

"ఆ దిగులేం అక్కర్లేదు. చివరిసారి చెప్పి చూస్తానన్నాడు. లేకపోతే ఖచ్చితంగా చెప్పేసి చేసుకుంటానన్నాడు."

"అగ్గదీ అలా ఉండాలి. మన అభిప్రాయం తప్పో, ఒప్పో- దానికి నిలబడాలి. చాలా సంతోషంగా ఉందయ్యా శంకరం! మంచి మిత్రుణ్ణి సంపాదించావు. ఈ రోజుల్లో అందరూ ఆదర్శాలు వల్లించేవాళ్ళే కాని కష్టాల కోర్చుకొనేవాళ్ళేరీ?" సంతోషంతో మరో చుట్ట ముట్టించాడు సుందరరామయ్య.

"పెళ్ళెక్కడ చేద్దామంటావు?"

"ఆ పల్లెటూరి సంగతి నీకు తెలుసుగా?



ఇక్కడే చేద్దాం. నేనేం ఎక్కువ ఆర్భాటాలకు పోదలుచుకోలేదు. ఉన్నంతలో చేద్దాం!"

"సుందరంకూడా ఈ మాటే అన్నాడు. ఈ ఆర్భాటాలకుపోయే మధ్యతరగతివాళ్ళు నాశనమవుతున్నారని."

"నిజమే. మా చిన్నతనంలో - వారం పది రోజుల ముందే మొదలుపెట్టేవాళ్ళు పిండివంటలు. పెళ్ళిరోజున సరేసరి. సగం పారేసేవాళ్ళు తిన్నంత తిని. మిగిలింది పారేసేవాళ్ళు బైట. పీటికి తోడు దానికి వంద. దీనికి పది ఇలాగ బోల్డంత ఖర్చు. ఇప్పుడా! అబ్బే జనం మారిపోయారు. అసలు నా పెళ్ళప్పుడు........"

"బజార్లో పనుంది. మీరు స్నానం అదీ కానివ్వండి. ఇప్పుడే వస్తాను ." రాధా సుందరాల వివాహం అతి నిరాడంబరంగా జరిగిపోయింది. రాధను వెంటబెట్టుకు వెళ్ళాడు సుందరం బొంబే. తల్లిదండ్రుల శాపనార్థాలు మంత్రాల్లో కలిసిపోయాయి. సుందరరామయ్య అట్టె ఖర్చు లేకుండా చెయ్యగలిగినందుకు చాలా ఆనందించాడు. నేటి యువకులు-ఆదర్శాలూ అనే అంశం మీద మాట్లాడం నేర్చుకున్నాడు కొత్తగా.

నాలుగేళ్ళ తర్వాత ఓ సాయంత్రం....

శంకర్రావు ఇంకా స్కూలు నుంచి రాలేదు. పేపరు చూస్తూ కాఫీ తాగుతున్న తమ్ముణ్ణి నిశితంగా చూస్తూ అడిగింది కాంత.

"ఆ అమ్మాయిని తప్ప చేసుకోనంటావు. అంతేనా?"

"అవును"

"ఉద్యోగం వచ్చింది. స్వతంత్రుడివయ్యావు. ఇహ పెద్దవాళ్ళమాటంటే ఏం లక్ష్యముంటుంది?" జడ విప్పదీస్తూ లేచివెళ్ళి దువ్వెనతెచ్చుకుని కిందకూర్చొని దువ్వడం మొదలెట్టింది.

"నాన్నేమన్నారు?"

"ఏవంటాడు. మామూలే, తన కిష్టం లేదన్నాడు ఈ సంబంధం!"

"మావయ్యేవన్నాడు."

"ఆయనకీ ఇష్టంలేదట."

"మనం చూసొచ్చిన అమ్మాయి ఏవంత అందంగా ఉందని?" తమ్ముడితో వెళ్ళి చూసొచ్చిన రను గుర్తుకొచ్చింది. నాన్నకేమీ ఆ సంబంధం ఇష్టంలేదు.

"మనం ఏవంత అందంగా ఉన్నామని?"

"ఇహ సరేలే" మూతితిప్పి జడవెనక్కి విసిరింది.

"వాళ్ళ నాన్నేమీ కట్నం ఇవ్వలేదు. ఇల్లూ అదీ చూశాంగా. ఆ అమ్మాయి వయస్సుకూడా ఎక్కువట."

"చిన్నప్పుడు స్కూల్లో వేసేటప్పుడు వయస్సు చాలక పెంచివేశారట, వాళ్ళన్నయ్య చెప్పాడు నాతో."

"ఆ చెప్పడానికేంలే."

"ఇంతకీ ఈ పెళ్ళి విషయంలో నీ అభిప్రాయమేమిటి?" అక్కను నిలదీశాడు. లోపలికి వెళ్ళి చేటలో బియ్యం తెచ్చి ఏరడం మొదలుపెట్టింది కాంత.

"అంతా నా అభిప్రాయం ప్రకారం జరిగితే ఇంకా కావాల్సిందేముంది? మీరు వింటారా? పెడతారా? ఏదో అడిగాం మొక్కుబడికి అన్నట్టు అడుగుతారు" నిష్ఠూరంగా అంది. పెద్దరికం దెబ్బతినడం అలావుంచి. ఆడపడుచు కట్నం పోతుందేమో! ఎన్నేళ్ళనించో కలలుకంటున్నరాళ్ళనెక్లెసేకానుక్కోవచ్చు. పెళ్ళయినకొత్తలో దాచుకునేది పెట్టెలో డబ్బులు. మళ్ళ ఇన్నాళ్ళకి.... ఇప్పుడు పెళ్ళికుదిరేలా లేదు.... తను ఇంతకాలం నించి కన్న కలలన్నీ.... తను భయపడుతున్నట్టే జరుగుతుందేమో!

"ఆడపడుచు కట్నం కనీసం వెయ్యి నూటపదహార్లు ఇవ్వాలి."

"నేను పెళ్ళి చేసుకుంటుంటే నీ కెందుకివ్వాలి?"

"అది ఆచారం."

"ఒక్క ఆచారానికి అర్థంఉన్నట్టుతోచదు నాకు."

"నాకు ఆడపడుచు కట్నం ఇవ్వకపోతే నేను రాను పెళ్ళికి." గోపీ ఏమీ మాట్లాడలేదు. శాంత దీర్ఘంగా ఆలోచిస్తోంది. ఇంటి ముందాగిన రిక్షాలోంచి దిగాడు సుందరరామయ్య. రిక్షావాడితో అప్పటికప్పుడు చిన్న గొడవ పెట్టుకొని, పావలా తగ్గించి ఇచ్చి లోపలికొచ్చాడు.

"ఇదేనా నాన్నా రావడం?" లేచికాళ్ళకు నీళ్ళిస్తూ అంది శాంత.

"ఊ." కొడుకుని చూశాడు కాని ఏం మాట్లాడలేదు.

గోపీ ఎటో చూస్తూ కూర్చున్నాడు. కాళ్ళు కడుక్కొని వచ్చి పడకకుర్చీలో కూర్చున్నాడు. తండ్రి తెచ్చిన పళ్ళను లోపల పెట్టింది శాంత.

"ఏమంటున్నాడు నీ తమ్ముడు?" ముసలితనం ఊరుకోనీలేదు ప్రశ్నించకుండా. చుట్ట చుట్టడంలో కాసేపు మునిగాడు. అక్కడున్న ఇద్దరూ ఏం మాట్లాడలేదు.

"గడ్డాలూ, మీసాలు రాగానే తల్లిదండ్రుల్ని మరిచిపోతారు."

"నేనేం మరిచిపోలేదు."

"కనబడుతూనే ఉందిగా, నిర్వాకం! ఇంకా చెప్పడం దేనికి? చూశావమ్మా శాంతా! ఆ పిల్లను చేసుకోవద్దని చెబుతూనే ఉన్నాంకదా! అయినా రోజూ తగాదాయె ఇంటో మొన్న వచ్చిన దగ్గర్నుంచి. భయమా? భక్తా ఈ కాలం పిల్లలకి? తమకు తోచిందే గొప్ప. ఎవడికీ ఏమీ తెలీదు. ఇదే మా చిన్నతనంలో...."

"అంతే అంతే" శాంత నిట్టూర్పు విడిచింది.

"ఆ అమ్మాయిలో ఏం లోపం కనిపించింది?" గోపీ అడిగాడు.

"గొప్పేమిటో చెప్పు ముందు? లోపాల సంగతి తరువాత."

"ఈ మాటలే అనొద్దంది. ఊరికే అరవడం తప్ప నేనెందుకు చేసుకోకూడదో చెప్పకూడదూ?"

"లక్షసార్లు చెప్పానిప్పటికి."


వాకిటి ముందు సైకిలు చప్పుడుకు ముగ్గురూ తలెత్తి చూశారు. సైకిలు స్టాండ్ వేసి లోపలికొచ్చాడు శంకర్రావు. వాతావరణం చాలా వేడిగా ఉందని పసిగట్టాడు. సమస్య తీవ్రం అవగానే మామగారు పరిగెత్తుకొస్తాడని తెలుసు. వాళ్ళు ముగ్గురూ ఒకరికొకరు తెలీని కొత్త మనుషుల్లా ఉన్నారు.

"ఎప్పుడొచ్చారు మీరు?"

"ఇప్పుడే."

"నువ్వోయ్?"

"మధ్యాహ్నం."




"ఏమిటీ తండ్రీ కొడుకులు ఒకేసారి ఊడిపడ్డారు? ఎన్ని ఉత్తరాలు రాసినా రాని వాళ్ళు."

గోపీ ఏం మాట్లాడలేదు.

"పీడితో పెద్ద చావొచ్చి పడింది" సుందరరామయ్య తనలో తనే గొణుక్కున్నాడు. శంకరరావు వైపు చూశాడు. గోపీ గోడ మీది లక్ష్మీదేవి బొమ్మని చూస్తున్నాడు.

"మొన్న మే వందరం వెళ్ళి చూసొచ్చిన అమ్మాయిని తప్ప చేసుకోనంటున్నాడు."

"శాంత చెప్పింది. అతని ఇష్టప్రకారమే చేసేద్దాం! ఏం పోయిందిప్పుడు?"

"నువ్వూ ఆ మాటే" అల్లుడు తనకు సపోర్ట్ ఇస్తాడనుకున్న సుందరరామయ్య విసుక్కున్నాడు.

"మీ కిష్టం లేదా?"

"లేదు."

"ఎందుకని?"

"కట్న కానుకలు ఇవ్వలేనివాళ్ళ సంబంధం పోతే, ఇహ దేశమే మునిగిపోయిందా? అవతల ఎక్కువ ఇచ్చే వాళ్ళు వున్నారన్నా ఉత్తమూర్ఖం, వినడు. ఎందుకు నా మాట వినాలన్న పంతం తప్ప."

"కట్నందేముందండీ! మర్నాటికి పైసా మిగలదు."

"అయినా ఆ ఉద్యోగాల్లేసే ఆడాళ్ళంటే నాకు గిట్టదు."

"ఇంకోచోట వచ్చే కట్నం ఆ అమ్మాయి ఏడాదిలో సంపాదిస్తుంది" అన్నాడు గోపీ.

"వయస్సులో వీడికంటె నాలుగేళ్ళు పెద్దది."

"ఎలా తెలుసు మీకు?" శంకరం అడిగాడు.

"పుల్లలు పెట్టేవాడున్నాడుగా మా మావయ్య చెప్పుంటాడు. ఆయన కూతుర్ని చేసుకోలేదని మంట."

"ఊరికే వాగమాక. మీ మావయ్యేమీ చెప్పలేదు. సుబ్బులిని చేసుకుంటే వచ్చే నష్టమేమిటో?"

"నాకు చదువు, ఉద్యోగమున్న పిల్ల కావాలి. కట్నంతో పనిలేదు."

"మీ అమ్మ, అక్కయ్య, రాధ ఏం చదివారు? ఏదో చాకలి పద్దులు, ఉత్తరమ్ముక్క రాయడం చేతనైతే చాలు!"

"నన్నయగారి కాలంలో పుట్టాల్సినవాడివి" అన్నాడు గోపీ.

"ఈ కాలానికి తగ్గట్టు నడవాలి మనం. ఇప్పటి పరిస్థితుల్లో ఒక జీతం మీద బ్రతకడం కష్టం. నన్ను చూస్తూనే ఉన్నావుగా" అన్నాడు శంకరం. శాంత మూతి మూడు వంకర్లు తిప్పింది.

"ఉద్యోగం చేసేదాన్నే కట్టుకోక పోయారూ?" శంకరం నవ్వాడు.

"ఇవన్నీ సరే, వయస్సు ఎక్కువ" సుందరరామయ్య మళ్ళీ మొదటికొచ్చాడు.

తండ్రీ కొడుకుల మధ్య ఈ సంభాషణంతా చాలా సార్లు జరిగుంటుందని ఊహించాడు శంకరం.

"స్కూల్లో వేసేటప్పుడు...."

"ఆ, అన్నీ దొంగ మాటలు. మంచినీళ్ళు పట్రామ్మా" శాంత లోపలికెళ్ళింది.

"మనం నీతి మంతులం; మిగతా వాళ్ళంతా దొంగలు!"

"ఎన్ని అబద్ధాలాడతారో నీకేంతెలుసు?"

"నీకు బాగా తెలుసన్నమాట."

"పెదర్థాలు తీయడం బాగా తెలుసు నీకు" మంచినీళ్ళు తాగి, ఆ గ్లాసుమీద చూపించాడు కోపం సుందరరామయ్య.

"పెద్దవాళ్ళ మాట విను. చెడిపోతావు లేకపోతే" ఆరేళ్ళు ముందు పుట్టిన ఆధిక్యతతో అంది శాంత.

"మీకేం కట్నాలిచ్చి చేశాడు అప్పుడు" గోపీ అడిగాడు. శంకరం పేపర్లో ఏదో హత్యకేసులో ఇరుక్కున్నాడు.

"మా సంగతి సరేలే. అప్పటి పరిస్థితి వేరు."

"ఇప్పటి స్థితి వేరు. అంతా మన భావాల్లోనే. అప్పుడు ఎంత తక్కువిస్తే అంత మంచిది. ఇప్పుడెంత గుంజితే అంత లాభం!"

సుందరరామయ్య కుర్చీలో అసహనంగా కదిలాడు. శంకరం పేపర్ పక్కన పడేశాడు.

"వాదన ఎందుగ్గాని, మేం కాదన్నా చేసుకుంటావన్నమాట" చివరిసారి అడి

గాడు సుందరరామయ్య.

"మామ్మాటికి."

"పెంచి పెద్దచేసి. చదువు చెప్పించిన వాళ్ళకంటె నిన్నకాక మొన్న చూసొచ్చిన పిల్ల ఎక్కువైంది నీకు!" ప్రపంచమంత బాధ ధ్వనించింది ఆయన గొంతులో.

"రాధ పెళ్ళి ఎలా చేశామో గుర్తుందా మీకు? బావ ఎలా చేసుకున్నాడో జ్ఞాపకం తెచ్చుకోండి. ఆనాడు బావే కనక తల్లిదండ్రుల్ని ఎదిరించి నిలబడలేకపోతే ఇవ్వాళ రాధ ఇంత సుఖంగా ఉండేదేనా? ఆ రోజు బావ చేసుకున్నందుకు తెగ మురిసిపోయావే! యువకుల ఆదర్శమంటూ ఊరంతా చెప్పొచ్చావుగా! నీ కొడుకు దగ్గర కొచ్చేసరికి 'కట్నాలు తీసుకోకుండా చేసుకుంటామా? ఎంత అనాచారం! ఆడాళ్ళకి చదువులెందుకు? ఉద్యోగాలెందుకు?' అంటూ కబుర్లు. వయసెక్కువ అని నాటకం. నీకూతురి పెళ్ళికి ఒక నీతి; నీ కొడుకు పెళ్ళికి మరో నీతి. అదేమంటే పరిస్థితి. అప్పటిదివేరు. ఇప్పుడు వేరు. తన ఆడబడుచు కట్నం పోతుందేమోనని అక్కయ్య బాధ. మావయ్యకేమో కూతుర్ని కట్టబెట్టే ఛాన్సు పోయిందని బాధ. నీబాధకు ఏ కారణం లేదు. నిజానికి నేనెక్కువ కట్నం తీసుకున్నా. తక్కువ తీసుకున్నా నీకొచ్చే లాభంలేదు. నష్టంలేదు. మీకసలు కోపంమీతో సంప్రదించకుండానే అమ్మాయి నచ్చిందని చెప్పడం. మీ పెద్దరికానికి ముప్పొచ్చిపడింది. హుందాగా ఉత్తరం రాసి సంప్రదాయాన్ని పాటించాలి. వాళ్ళేవో ఆశలు పెంచుకోవాలి. ఆ బోడి గొప్పంతా పెళ్ళప్పుడు చూపించాలి. అది పోయిందని అక్కసు. కోపం. తండ్రిని కాబట్టి నామాట వినాలని పంతం. వయస్సుని కప్పదాటు. మళ్ళీ భక్తిగా "రాముడికంటె సీత పెద్దద"ని కథలు. మీరంతా ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకుంటున్నప్పుడు. నేను మాత్రం ఎందుకు చూసుకోకూడదు? నా ద్వారా మీ కోరికలు. ఆశలు నెరవేర్చుకోవాలని అనుకుంటున్నప్పుడు. నేను మాత్రం ఎందుకు అనుకోకూడదు? నేనలా చేస్తే తప్పా? ఇంకా అక్కసుతో ఏమైనా అంటారు. ఇంకా ఎందుకో అనలేదు ఆ పిల్ల చెడిపోయిందని. మావయ్య ఈపాటికి మొదలెట్టే ఉంటాడు ప్రచారం. మీరు ఒప్పుకున్నా. ఒప్పుకోకపోయినా రమను చేసుకోవడం ఖాయం"

ఎప్పుడు లేచి నిలబడ్డాడో అతనికి తెలీదు.

నిశ్శబ్దం.... ఒకటే నిశ్శబ్దం. శాంత ఏదో పని ఉన్నట్టు లోపలికెళ్ళింది. చుట్ట కాలుస్తూ ఏం మాట్లాడలేదు సుందర రామయ్య.

"ఇదే చివరి మాట. నీ పెళ్ళికి మే మెవరం రాము. నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో పో."

"ఇక్కడున్న వాళ్ళెవరూ రారు."

"మీ విషయం మీరు చెప్పుకోండి. అందరి సంగతి మీకెందుకు?"

"ఉద్యోగం వచ్చి నాలుగు డబ్బులు కళ్ళబడగానే ఎవర్నీ లెక్కచెయ్యరు!"

"నేను వున్నది వున్నట్టు చెప్పాను; ఆలోచించమని. కాని మీకు నిజాన్ని ఒప్పుకునే ధైర్యం లేదు. నీతి చాలా బలహీనం."

"మీరేమంటారు బావా?"

"నేను కూడా రాను" గోపీ విచిత్రంగా చూశాడు బావగారిని. ముసలాయన మీసాల కింద చిరునవ్వు వెలిగింది.

"నాన్నా! స్నానం చెయ్యండి" శాంత లోపలున్నించి పిలిచింది.

"వస్తున్నా" లేచి వెళ్ళాడు సుందర రామయ్య ఎలాగయినా తన అల్లుడు తన అల్లుడే అనుకుంటూ.

"మీరు కూడా ఇలా అంటారా?" లేచి నిలబడ్డాడు గోపీ. బైటకు నడిచాడు. శంకర రావు అతణ్ణి అనుసరించాడు. ఎంతో లిబరల్‌గా ఆలోచించగలడనుకున్న బావగారి మాటలకు షాక్ అయ్యాడు గోపీ.

"చూడు గోపీ! నీ మాటలన్నీ నిజం. ఆనాడు రాధ పెళ్ళికి ఒక నీతి. ఇవ్వాళ మరో నీతి. మనుషులింతే! నేనెందుకు రానన్నానని నువ్వడగొచ్చు. నాకు కేవలం పెద్దరికంమీద గౌరవమే కారణం. మావయ్యనీ. శాంతనీ బాధపెట్టడం ఇష్టంలేక."

"నువ్వూ అలాంటివాడివే. అన్నీ కబుర్లే."

"నువ్వేమన్నా నాకు బాధలేదు. నిజం చెబుతున్నాను కనక మేమంతా వస్తే ఒరిగేది లేదు; రాకపోతే నష్టంలేదు. నువ్వూ. ఆ అమ్మాయి సుఖంగా ఉండాలి. నేనొక్కణ్ణే వచ్చినా నలుగురూ నాలుగు రకాల అనుకుంటారు. అటు మావయ్యనీ. ఇటు శాంతనీ భరించలేను. నీ ఇష్టప్రకారమే కానీ. నా సహాయం నీ కెప్పుడూ ఉంటుంది."

"ఆ నలుగురికీ భయపడుతున్నావా?"

"భయం. నిర్భయం రెండూ సహజాతాలు. మనసుని బట్టి మారతాయి."

"నేనిక వెళ్తాను."

"మళ్ళీ మనం కలుస్తామో లేదో? ఒక్క మాట చెబుతాను. నేను నలుగురికి భయపడనని ఎవడన్నా అన్నా నమ్మక. అంతా అబద్ధం. మన మధ్యతరగతితిరుగుబాట్లన్నీ స్వార్థపూరితం. మాదీ; నీదీ కూడా. ఈ తిరుగుబాటు ఇప్పటి స్థితినుంచిపుట్టింది. మా తిరుగుబాటు సాంప్రదాయికం; నీది నవీనం. నేను తిరుగుబాటును ఆహ్వానిస్తాను."

గోపీ మునిసిపాలిటీవారి చీకట్లో కలిసిపోయాడు. ఏదో ఆరని ఆశా నక్షత్రం అకాశాన ఆహ్వానిస్తోంది. ●

